ఐపీఎల్ స్పెషల్

పరాగ్ 2.0

''ఎన్‌సీఏలో కొద్దివారాల క్రితమే ఓ వ్యక్తిని కలిశాను. అతడు చిన్న గాయం నుంచి కోలుకోవడానికి ఇక్కడికి వచ్చాడు. ఆ కుర్రాడు పూర్తిగా తన రికవరీ మీదే దృష్టి సారించి కఠినంగా శ్రమిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. అక్కడున్న ఒక కోచ్ నాతో.. 'అతడు మారిన మనిషి' అని చెప్పాడు. అవును.. ఇప్పుడు నేను దానిని స్వయంగా ఆస్వాదిస్తున్నా.. రియాన్ పరాగ్ 2.0'' టీ20లలో వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ గురువారం రాజస్థాన్-ఢిల్లీ మ్యాచ్‌లో రాయల్స్ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత చేసిన ట్వీట్ అది. అవును.. పరాగ్ ఇప్పుడు మారిన మనిషి..!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఐపీఎల్‌లో బహుశా రియాన్ పరాగ్ ఎదుర్కొన్నంత ట్రోలింగ్ మరే క్రికెటర్ అనుభవించలేదంటే అతిశయోక్తి కాదేమో. 17 ఏండ్ల వయసులోనే (2019లో) ఈ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన పరాగ్.. ఆట కంటే ఎక్కువ 'అతి' తోనే ట్రోలర్స్‌కు, మీమ్ పేజీలకు సరుకుగా మారాడు. ఎక్స్ (ట్విటర్)తో పాటు మీడియాలో అతడు ఏం మాట్లాడినా నెటిజన్లు ఆటాడుకునేవాళ్లు. 'ఆట కంటే అటిట్యూడ్ ఎక్కువ' అంటూ పరాగ్‌పై సోషల్ మీడియా ముద్ర వేసింది. వాళ్ల విమర్శలకు తగ్గట్టు ఫీల్డ్‌లో ఈ అస్సాం కుర్రాడి వ్యవహార శైలి పలుమార్లు వివాదాస్పదమైంది. గత సీజన్‌లో దారుణంగా విఫలమైన (7 మ్యాచ్‌లలో 78 రన్స్) అతడిని రాజస్థాన్ అనవసరంగా భరిస్తుందని, వేలానికి వదిలేయడం ఉత్తమమని ఉచిత సలహాలూ ఇచ్చిన వారూ లేకపోలేదు. అంతకు ముందు మూడు సీజన్లలో (183, 93, 86)నూ ఆ జట్టుకు ఆడిన దాదాపు మొత్తం మ్యాచ్‌లలో ఉన్న పరాగ్.. తన మార్కును చూపలేకపోయాడు.

బ్యాట్‌తోనే సమాధానం..

గతమెలా ఉన్నా ఐపీఎల్-17 లో ఆడిన రెండు మ్యాచ్‌ల ద్వారా పరాగ్ ఎంతో మెరుగయ్యాడనేది అతడి ఆటను చూసిన వారికి అనిపించక మానదు. 2023 సీజన్ దాకా రాజస్థాన్ అతడిని ఫినిషర్‌గానే వాడింది. కానీ ఈ సీజన్‌లో అతడు నాలుగో స్థానంలోకి ప్రమోషన్ పొందాడు. లక్నోతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆ జట్టు 49 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు వచ్చి శాంసన్‌తో మూడో వికెట్‌కు కీలకమైన 92 పరుగులు జోడించాడు. ఢిల్లీతోనూ రాజస్థాన్ కష్టాల్లో (36/3) ఉన్నప్పుడే వచ్చి బౌలర్లు విజృంభిస్తున్న వేళ ఓపికగా ఆడాడు. తొలి 26 బంతుల్లో అతడు చేసింది 26 పరుగులే. కానీ 15 వ ఓవర్ తర్వాత మొదలైన విధ్వంసం నోకియా వేసిన చివరి ఓవర్లో శిఖరాగ్రానికి చేరింది. ఇంతవరకూ ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడని ఓ కుర్రాడు.. అగ్రశ్రేణి బౌలర్‌గా ఉన్న నోకియా బౌలింగ్‌లో 25 పరుగులు రాబట్టాడు. నోకియా 144 కిలోమీటర్ల వేగంతో వేసిన బౌన్సర్‌ను దీటుగా ఎదుర్కొని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదిన షాట్‌ను చూసి తీరాల్సిందే. 26 బంతుల వరకూ బాల్‌కు ఒక్క పరుగు అన్నట్టుగా చేసిన పరాగ్.. 45 బంతుల్లో 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

పరిణితితో కూడిన ఆట..

ఈ రెండు మ్యాచ్‌లలోనూ పరాగ్ పరిణితితో కూడిన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో బౌలర్లు విజృంభిస్తున్న వేళ వికెట్‌ను కాపాడుకున్న అతడు.. ఆఖర్లో జూలు విదిల్చి తన జట్టుకు భారీ స్కోరును అందించాడు. ఆటతో పాటు పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో పరాగ్ మాట్లాడే తీరులోనూ పరిణితి కనిపించింది. పరిస్థితులకు తగ్గట్టుగా అతడు తన ఆటను మలుచుకున్న తీరు ప్రశంసనీయం.

కేకేఆర్ జోరు

నరైన్ (47)

చిన్నస్వామిలో ఆర్సీబీకి చుక్కెదురు • భారీ లక్ష్యాన్ని దంచేసిన నరైన్, 'అయ్యర్'లు • కోహ్లీ శ్రమ వృథా

'ఐపీఎల్‌లో నేను ప్రతిసారి ఓడించాలనుకుని, నా కలలో సైతం గెలవాలనుకునే ఒకే ఒక జట్టు ఆర్సీబీ' అన్న కేకేఆర్ మెంటార్ గౌతం గంభీర్ మాటల నుంచి స్ఫూర్తి పొందారో ఏమో గానీ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఆటగాళ్లు అదరగొట్టారు. ఐపీఎల్ ఫ్యాన్స్ 'ఎల్ ప్రిమేరో'గా పిలుచుకునే ఆర్సీబీ-కేకేఆర్ పోరులో మరోసారి కోల్‌కతాదే పైచేయి అయింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీతో ముగిసిన పోరులో డుప్లెసిస్ సేన 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. కేకేఆర్ మరో 19 బంతులు మిగిలుండగానే ఛే'దంచేసింది'. బెంగళూరు హీరో విరాట్ కోహ్లీ పోరాడినా బౌలర్ల వైఫల్యంతో ఆ జట్టు పరాభవాన్ని మూటగట్టుకుంది. ఐపీఎల్-17లో భాగంగా ఆతిథ్య జట్టు (10 మ్యాచ్‌లలో) ఓడిపోవడం ఇదే ప్రథమం.

బెంగళూరు: వారం రోజుల క్రితమే మొదలైన ఐపీఎల్-17లో భాగంగా సొంత ఇలాఖాలో ఆడుతున్న మ్యాచ్‌లను ఆతిథ్య జట్లే గెలుస్తూ వస్తున్న సంప్రదాయానికి తెరపడింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. తమ సొంత గ్రౌండ్ అయిన చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో చిత్తైంది. టాస్ ఓడి ముందు బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 83 నాటౌట్, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) వరుసగా రెండో అర్ధ సెంచరీ సాధించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. భారీ ఛేదనలో కోల్‌కతా.. 16.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 186 పరుగులతో ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 50, 3 ఫోర్లు, 4 సిక్సర్లు), సునీల్ నరైన్ (22 బంతుల్లో 47, 2 ఫోర్లు, 5 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (24 బంతుల్లో 39 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) లు చిన్నస్వామిలో మెరుపులు మెరిపించారు. సునీల్ నరైన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కోహ్లీ నిలకడ..

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు వచ్చిన ఆర్సీబీకి ఈ సీజన్ మూడో మ్యాచ్‌లోనూ ఆశించిన ఆరంభం దక్కలేదు. కెప్టెన్ డుప్లెసిస్ విఫలమయ్యాడు. డుప్లెసిస్ నిరాశపరిచినా కోహ్లీ.. గ్రీన్‌తో జతకలిసి కేకేఆర్ బౌలర్లను ఆటాడుకున్నాడు. ఈ ఇద్దరూ స్టార్క్, నరైన్‌లను లక్ష్యంగా చేసుకుని బ్యాట్‌కు పనిచెప్పడంతో పవర్ ప్లేలో ఆర్సీబీ స్కోరు పరుగులెత్తింది. 42 బంతుల్లోనే ఈ జోడీ 65 రన్స్ జోడించింది. గ్రీన్‌ను రసెల్ 9వ ఓవర్ చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ చేసి పార్ట్‌నర్‌షిప్‌ను బ్రేక్ చేశాడు. 19 బంతుల్లో 3 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 28 పరుగులు చేసి టచ్‌లోకి వచ్చినట్టే కనిపించిన మ్యాక్స్‌వెల్.. ఎక్కువసేపు నిలువలేకపోయాడు. ఓ వైపు క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నా కోహ్లీ మాత్రం పరుగుల వేటను ఆపలేదు. 36 బంతుల్లో అతడి అర్ధ సెంచరీ పూర్తయింది. ఆఖర్లో దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 20, 3 సిక్సర్లు)తో వేగంగా ఆడిన కోహ్లీ.. ఆర్సీబీ స్కోరును 180 మార్క్ దాటించాడు.

కేకేఆర్ ధనాధన్

బెంగళూరు భారీ స్కోరే చేసినా 'చిన్నస్వామి'లో కేకేఆర్ దూకుడు ముందు లక్ష్యం చిన్నబోయింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్‌లు ఆర్సీబీ బౌలర్లను ఉతికారేశారు. సిరాజ్ మొదటి ఓవర్లోనే సాల్ట్.. రెండు సిక్సర్లు, ఓ బౌండరీతో 18 రన్స్ రాబట్టాడు. జోసెఫ్ వేసిన మూడో ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన నరైన్.. ఆరో ఓవర్లో యశ్ దయాల్‌పై దయ లేకుండా విరుచుకుపడ్డాడు. ఈ ఓవర్లోనూ 21 పరుగులొచ్చాయి. పవర్ ప్లే ముగిసేసరికే కేకేఆర్ వికెట్ నష్టపోకుండా 85 పరుగులు చేసింది.

పని ముగించిన 'అయ్యర్'లు

పవర్ ప్లే ముగిశాక వరుస ఓవర్లలో ఓపెనర్లు నిష్క్రమించినా వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్‌లు మిగతా పని పూర్తి చేశారు. జోసెఫ్ 11వ ఓవర్లో వెంకటేశ్.. 6, 4, 6, 4తో రెచ్చిపోయాడు. 30 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయింది. అర్ధ సెంచరీ తర్వాత అతడు పెవిలియన్ చేరినా శ్రేయస్ విన్నింగ్ రన్స్ సాధించాడు.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 182/6 (కోహ్లీ 83 నాటౌట్, గ్రీన్ 33, రసెల్ 2/29, రాణా 2/39) **కోల్‌కతా :** 16.5 ఓవర్లలో 186/3 (వెంకటేశ్ 50, సునీల్ నరైన్ 47, శ్రేయస్ 39 నాటౌట్, వైశాక్ 1/23, దాగర్ 1/23)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
చెన్నై	2	2	0	1.97	4
కోల్‌కతా	2	2	0	1.04	4
రాజస్థాన్	2	2	0	0.80	4
హైదరాబాద్	2	1	1	0.67	2
పంజాబ్	2	1	1	0.02	2
బెంగళూరు	3	1	2	-0.71	2
గుజరాత్	2	1	1	-1.42	2
ఢిల్లీ	2	0	2	-0.52	0
ముంబై	2	0	2	-0.92	0
లక్నో	1	0	1	-1.00	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

గౌతీ, కోహ్లీ భాయ్ భాయ్

ఎప్పుడూ ఉప్పునిప్పులా ఉండే గౌతం గంభీర్, విరాట్ కోహ్లీ ఒక్కటయ్యారు! చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ సందర్భంగా గౌతీ, కోహ్లీ కలివిడిగా కనిపించారు. టైమ్ ఔట్‌లో ఇద్దరు కలిసి సరదాగా నవ్వుతూ మాట్లాడుకున్నారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

241 సిక్సర్లు: ఆర్సీబీ తరపున అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ రికార్డు (239)ను కోహ్లీ అధిగమించాడు.

2016 నుంచి ఇప్పటిదాకా చిన్నస్వామి స్టేడియంలో కేకేఆర్‌తో ఆడిన మ్యాచ్‌లలో ఆర్సీబీ నెగ్గలేదు. బెంగళూరులో కోల్‌కతాకు ఇది వరుసగా ఆరో విజయం.

సెమీస్‌లో సిక్కి, సుమిత్

స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో భారత జోడీ సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో సిక్కి, సుమిత్ ద్వయం 14-21, 21-11, 21-17తో రేహాన్ నౌఫల్, లిసా అసు కుసుమవతి(ఇండోనేషియా) జంటపై అద్భుత విజయం సాధించింది. 41 నిమిషాల పాటు జరిగిన పోరులో సిక్కి, సుమిత్ మెరుగైన ప్రదర్శన కనబరిచారు. తొలి గేమ్‌ను ప్రత్యర్థి చేజార్చుకున్న సిక్కి, సుమిత్ తిరిగి పుంజుకుని పోటీలోకి వచ్చారు. చక్కని సమనయ్యంతో డ్రాప్ షాట్లు, నెట్‌గేమ్‌తో వరుసగా రెండు గేమ్‌లను దక్కించుకుని మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 26-24, 17-21, 20-22తో సుపనిద కాటెతాంగ్(థాయ్‌లాండ్) చేతిలో ఓడి నిష్క్రమించింది. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో, అశ్విని పొనప్ప జోడీ 13-21, 19-21తో లీ చియ్, టెంగ్ చున్ జంట చేతిలో ఓడింది.

'వసూలీ టైటాన్స్'

పూజా వస్త్రకార్ సంచలన పోస్ట్

మోదీ, అమిత్‌షాను ట్రోల్ చేసిన భారత ఆల్‌రౌండర్

ముంబై: భారత మహిళా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ పొలిటికల్ పోస్టుతో వివాదంలో చిక్కుకుంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల వేళ ఆమె.. కాంగ్రెస్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ వంటి బీజేపీ ప్రముఖులు ఒక క్రికెట్ జట్టుగా ఉన్న మార్ఫ్‌డ్ ఫొటోతో 'వసూలీ టైటాన్స్' అని సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న పోస్ట్‌ను షేర్ చేసింది. అంతేగాక ఈ పోస్టుకు 'ఇంపాక్ట్ ప్లేయర్: ఈడీ' అని జత చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రతిపక్ష నాయకులను ఈడీ అదుపులోకి తీసుకుంటున్న నేపథ్యంలో వస్త్రకార్ చేసిన ఈ పోస్ట్‌పై నెట్టింట భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. వస్త్రకార్ పోస్ట్ నెట్టింట వైరల్ అయిన కొద్దిసేపటికే ఆమె దీనిని తొలిగించింది. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో తన ప్రమేయం లేకుండా వచ్చిన పోస్ట్‌పై పూజ..ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పింది.

కొప్పుల ఈశ్వర్‌తో మాట్లాడుతున్న మల్లమ్మ

కేసీఆరే బీదలను కాపాడిండు

- గీ రేవంత్‌రెడ్డి మోసం చేసిండు
- మందమర్రి బీఆర్ఎస్ ప్రచారంలో ఓ వృద్ధురాలి ఆక్రోశం

మంచిర్యాల, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా మందమర్రిలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకున్నది. మందమర్రిలోని కూరగాయల మార్కెట్‌లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారం చేస్తూ ఆడెపు మల్లమ్మ అనే 65 ఏండ్ల వృద్ధురాలిని పలుకరించారు. పింఛన్ ఇయ్యక ఎన్ని నెలలైతంది మల్లమ్మా.. అని అడగ్గా.. మూడు నెలలైంది బాంచెన్ అని సమాధానం చెప్పింది. 'గదే కేసీఆర్ సార్ రూ. 2 వేల పింఛన్ ఎమర్జెన్సీగా ఇచ్చిండు. మాలాంటి బీదోళ్లను కాపాడిండు. నిజం చెప్తున్నా.. గీ రేవంత్‌రెడ్డి మోసం చేసిండయ్యా. కాంగ్రెస్‌ోళ్లను పింఛన్ కోసం అడిగితే నిన్నెవ్వడు ఎయ్యమన్నడు ఓటు.. నాలుగు వేలిస్త అని గ్యారంటీ రాసిచ్చిండా? అంటున్నరు' అని మల్లమ్మ వాపోయింది. మరి ఇప్పుడు ఏం చేసుడు అని కొప్పుల ఈశ్వర్ అడగ్గా.. ఇగ ఏం చేస్తం.. గాయనకు ఇగ ఓటు వేయం అని చెప్పింది. 'మీరు మా ముసలోళ్లు, మూడుగోల్లను చూడుర్రి. మాకు మందులకు మాకులకు అక్కర్రావాలే బాంచన్. నిన్ను ఎక్కడనో చూసినట్టుం దయ్యా' అంటూ మాట్లాడుకొచ్చింది. దానికి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. 'నేను ధర్మపురికి నాలుగుసార్లు ఎమ్మెల్యే, గోదావరిఖనికి రెండుసార్లు ఎమ్మెల్యే, మంత్రిగా కూడా చేసిన' అని ఆయన చెప్పగానే.. అవునా ధర్మపురిల చూసిన కావచ్చు అంటూ సంబురపడింది. ఇందంతా జరుగుతున్నప్పుడు మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సైతం పక్కనే ఉన్నారు.

వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

- సిరిసిల్ల నేత కార్మికుల బకాయిలు విడుదల చేయాలి
- సీఎంకు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం కారణంగా 4 నెలలుగా పవర్‌లూమ్ యజమానులు, నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.270 కోట్ల బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారిని ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. వస్త్ర పరిశ్రమపై ఆధారపడి పని చేస్తున్న 20 వేల మంది పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, 27 రోజులుగా చేనేత కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 24 ఏండ్లుగా 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను నిలిపివేశారని, సబ్సిడీని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మికులకు 10 శాతం యార్న్ సబ్సిడీ ఇవ్వాలని, గత ప్రభుత్వం రూ.370 కోట్లతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

విపక్షాల బలహీనతే మోదీ బలం

- అన్ని పార్టీలకూ ఎలక్టోరల్ బాండ్లు
- ఈ అంశం ఎన్నికలపై పెద్దగా ప్రభావం చూపదు: సీనియర్ జర్నలిస్టు సుతాను గురు స్పష్టీకరణ

చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న సుధాను గురు

ఖైరతాబాద్, మార్చి 29: దేశంలో ప్రతిపక్షాలన్నీ బలహీనంగా ఉన్నాయని, ఇదే ప్రధాని నరేంద్రమోదీకి బలంగా మారిందని సీనియర్ జర్నలిస్టు, సీ-ఓటర్స్ రిసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుతాను గురు అన్నారు. 'ఇండియా టు భారత్' పేరుతో 90 రోజులపాటు చేస్తున్న దేశ యాత్రలో భాగంగా ఆయన శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నియో సైన్స్ హబ్, సైన్స్‌అండ్ టెక్నాలజీ మాసపత్రిక, స్మార్ట్ ల్యాబ్ టెక్ సంస్థలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొని.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజల మనోగతం తదితర అంశాలపై చర్చించారు. భారత తొలి ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హయాం వరకు పరిపాలన ఒక శకంలా కొనసాగిందని, ఆ తర్వాత 2014 వరకు దేశాన్ని పాలించిన ప్రధానులు అంతగా ప్రభావాన్ని చూపలేకపోయారని పేర్కొన్నారు. మోదీ హయాంలో దేశం కొంత అభివృద్ధి చెందినప్పటికీ సామాన్య ప్రజల స్థితిగతులు ఏమాత్రం మారలేదని, ముఖ్యంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు కొరవడటం లాంటి సమస్యల వల్ల ఇప్పటికీ ఎన్నో కోట్ల మంది దుర్భర జీవనాన్ని సాగిస్తున్నారని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లను దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు పొందాయని పేర్కొంటూ.. ఈ అంశం ఎన్నికల్లో పెద్దగా ప్రభావాన్ని చూపబోదని అభిప్రాయపడ్డారు. అవినీతికి ఏ పార్టీ అతీతం కాదన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలకంటే ఎంతో కొంత నయమను కొని బీజేపీకే ఓట్లు వేస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని, వారి సమస్యలను తమకు అనుకూలంగా మార్చుకోవడంలో విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. దక్షిణాది, ఉత్తరాది ఓటర్లకు అనేక వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన పేర్కొంటూ.. పాలకులు తమ కనీస అవసరాలు తీర్చితే చాలని భావించే ఉత్తరాది ఓటర్ల కంటే దక్షిణాది ఓటర్లు భిన్నంగా ఆలోచించడంతోపాటు మాతృభాషలు, సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విలువ ఇస్తారని వివరించారు. అందుకే దక్షిణాదిలో జాతీయ పార్టీలు పాగా వేయలేకపోతున్నాయని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం ఇక్కడ అంతగా ప్రభావం చూపలేకపోతున్నాయని అన్నారు. దేశంలోని సామన్య ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకుని వారి ఆకాంక్షలను అర్థం చేసువాలన్న లక్ష్యంతోనే 'ఇండియా టు భారత్' యాత్రను చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత రాకా సుధాకర్, నియో సైన్స్ హబ్ మాసపత్రిక మేనేజింగ్ డైరెక్టర్, పబ్లిషర్ సత్యప్రసాద్ పీవీ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సుబ్రహ్మణియన్ అయ్యర్ పాల్గొన్నారు.

కాచిన నూనెలతో మెదడుకు ముప్పు

- క్యాన్సర్, కాలేయ వ్యాధులకు దారితీసే ప్రమాదం
- ఏఎస్ఎఫ్‌బీఏఎంబీ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కాచిన నూనెలతో మళ్లీ వంటలకు వినియోగిస్తే మెదడుకు ముప్పు తప్పదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలేయ, క్యాన్సర్‌తోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే అవకాశమున్నదని స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన ఏఎస్ఎఫ్‌బీఏఎంబీ (అమెరికన్ సొసైటీ ఫర్ బయో కెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ) వార్షిక సమావేశంలో ఈ అధ్యయానికి సంబంధించిన నివేదికను వెల్లడించారు. ఈ పరిశోధనల్లో నూనెకు, మెదడు ఆరోగ్యానికి మధ్య ఉన్న సమస్యల గురించి వెల్లడైంది. ఎలుకలపై పరిశోధనలు నిర్వహించినట్టు వారు తమ నివేదికలో వెల్లడించారు. కొన్ని ఎలుకలకు సాధారణ ఆహారం ఇవ్వగా, మరి కొన్నింటికి కాచిన నూనెతో చేసిన ఆహారం ఇచ్చారు. ఈ రెండింటినీ పోల్చి చూస్తే.. కాచిన నూనెతో చేసిన ఆహారం తిన్న ఎలుకల్లో మెదడు అనారోగ్య ముప్పును ఎదుర్కొన్నాయని పరిశోధకులు తెలిపారు. కాచిన నూనెతో చేసిన వంటల వినియోగంతో శారీరక సమతుల్యత దెబ్బ తింటుందని గుర్తించారు. కీలకమైన జీర్ణ వ్యవస్థ, కాలేయాన్ని దెబ్బతీస్తుందని తేలింది. ఈ నూనె కారణంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని పలువురు ఆరోగ్య నిపుణులూ హెచ్చరిస్తున్నారు. ఇది ఫ్రీ రాడికల్స్ ముప్పు పెంచుతుందని, దీనివల్ల దేహంలో వాపు ఏర్పడి ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పుడు తాజా పరిశోధన కూడా వాటిని నిరూపిస్తున్నదని పరిశోధకులు వెల్లడించారు. పదే పదే వేడిచేసిన నూనెలతో చేసిన వంటలతో మనిషి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలూ పెరగుతాయని, దీర్ఘకాలిక రోగాలు వేధిస్తాయని పరిశోధకులు చెప్తున్నారు. ఈ ప్రమాదాలను తగ్గించుకోవడానికి.. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

మళ్లీ యూనివర్సిటీలకు 40+ వయస్కులు

నైపుణ్యాల పెంపునకు సింగపూర్ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 29: కృత్రిమ మేధ రాకతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు తమ దేశ ప్రజలను సింగపూర్ మళ్లీ యూనివర్సిటీల బాట పట్టిస్తున్నది. ఇందుకోసం పూర్తికాల డిప్లొమా కోర్సును రూపొందించింది. 40 ఏండ్ల పైబడినవారు ఈ కోర్సులు చదవడానికి 90 శాతం ఫీజు రాయితీ కూడా అందిస్తున్నది. ప్రస్తుతం 40 ఏండ్ల పైబడిన ఉద్యోగులు తాము 20 ఏండ్ల క్రితం చదువుకున్న చదువులకు, ఇప్పటి చదువులకు ఎంతో మార్పు ఉంటుందని ఆ దేశ పార్లమెంట్ ఎంపీ టాన్ ఊ మెంగ్ తెలిపారు. 'అనుభవజ్ఞులైన ఉద్యోగులు తమ జీవితానుభవాలను. జీవన నైపుణ్యాలను తరగతి గదిలోకి తీసుకొస్తారు. అలాగే యువ విద్యార్థులతో కలిసి వారు కొత్త నైపుణ్యాలు నేర్చుకొంటారు' అని మెంగ్ అభిప్రాయపడ్డారు.

కొండెక్కిన నిమ్మ ధరలు

- నెల రోజుల్లోనే 350% అధికం
- తగ్గిన ఉత్పత్తి, పెరిగిన డిమాండ్

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): వేసవి ఎండలు రోజు రోజుకూ మండిపోతుండటంతో తాపాన్ని తగ్గించుకునేందుకు జనం వివిధ రకాల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మార్కెట్లో నిమ్మకాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. గతంలో రూ.20కి లభ్యమైన అరడజను పెద్దసైజు నిమ్మకాయలు.. ఇప్పుడు రూ.40 వరకు పలుకుతున్నాయి. విడిగా అయితే ఒక్కో నిమ్మకాయను రూ.10, చిన్న సైజుదైతే రూ.5 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ ధరలను చూసి సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. నిమ్మకాయల ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడం ఇందుకు కారణం. నిమ్మసాగు అధికంగా జరిగే కర్ణాటకలో ఈ ఏడాది ఉత్పత్తి దాదాపు 40 శాతం తగ్గింది. దీంతో ఆ రాష్ట్రంలో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలు భారీగ